## మంత్రి కేటీఆర్‌కు రజక సంఘం నాయకుల వినతి

నడికూడ, అక్టోబర్ 6: హనుమకొండ పర్యటనలో భాగంగా న్యూ శాయంపేట సర్కిల్ వద్ద రజక కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభోత్సవానికి శుక్రవారం విచ్చేసిన మంత్రి కేటీఆర్‌ను రజక సంఘాల సమితి కోకన్వీనర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రజకుల ఆత్మగౌరవ భవనానికి మేడిపల్లిలో కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని ఉప్పల్ భగాయత్‌కు మార్చాలని, వీరనారి చాకలి ఐలమ్మ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ మధుచందర్, సిరిసిల్ల రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, నాయకులు కొన్నె సంపత్, పెద్దాపురం కుమారస్వామి, డాక్టర్ గంగాధర్, గుడికందుల శివ, కొంరాజు ప్రశాంత్ పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్‌కి వినతిపత్రం అందిస్తున్న రజక సంఘ నాయకులు

## క్రీడలకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం

గీసుగొండ, అక్టోబర్ 6 : తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి అన్నారు. మండలంలోని మరియపురంలో శుక్రవారం ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా సామగ్రిని క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలు క్రీడా సామగ్రిని వినియోగంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిరంజీవి, కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.


బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య

## మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

దామెర, అక్టోబర్ 6 : మండలంలోని పసరగొండలో ప్రభుత్వం పంపిన బతుకమ్మ చీరలను సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పండుగలకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే పులుకుర్తి, సీతారాంపురం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

## ఎంజేపీ విద్యార్థులకు బహుమతులు

దామెర, అక్టోబర్ 6: మండలంలోని ఓగులాపురం ఎస్‌బీఐటీలో ఉన్న ఎంజేపీ సంగెం విద్యార్థులు కమలాపురం ఎంజేపీలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో పలు బహుమతులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ యాదగిరి శుక్రవారం తెలిపారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాలు ఖోఖో, పరుగుపందెం, వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయుడు శ్రీనాథ్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## 'ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయ సర్టిఫికెట్లు'పై విచారణ జరపాలి

శాయంపేట, అక్టోబర్ 6: ప్రభుత్వ ఉద్యోగులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేసిన విషయంపై విచారణ జరపాలని ఏబీవీఎస్‌ఎఫ్, డీవైఎఫ్‌ఐ, బీఎస్‌ఎస్ నాయకులు తహసీల్దార్ సుభాషినికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఆయా సర్టిఫికెట్లను రద్దు చేయడంతోపాటు జారీ చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. బీఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు మారపెల్లి క్రాంతికుమార్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్, బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేశ్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు


అక్కంపేట గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



రైతులకు పంట నష్టపరిహారం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే చల్లా

# సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

- ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దు
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- అక్కంపేటలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం
- దామెర, ల్యాదెల్లలో మహిళా భవనాలు, దామెర తహసీల్దార్ ఆఫీస్ ప్రారంభం
- 1,583 మంది రైతులకు రూ.1.36కోట్ల పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ

ఆత్మకూరు/ దామెర, అక్టోబర్ 6: సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శమని, బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం అక్కంపేటలో రూ.16లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయితీ భవనం, దామెర మండలం ల్యాదెల్లలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా కమ్యూనిటీ భవనం, దామెరలో రూ.2.13కోట్ల వ్యయంతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం, రూ.20లక్షలతో నిర్మించిన మహిళా కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలన్నీ సమగ్రంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు ఇచ్చి రైతుల కష్టాలను తొలగించారని, వ్యవసాయాన్ని పండుగ చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లుగా పరిపాలించి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందన్నారు. ఆ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో అమలు కాని హామీలను ఇక్కడ ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే ప్రతిపక్షపార్టీల నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో జరిగిన అభివృద్ధిని చూసి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో రూ.200 ఉన్న ఆసరా పింఛన్‌ను సీఎం కేసీఆర్ రూ.2,016కు పెంచారని తెలిపారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇచ్చే సీఎం కేసీఆర్ కావాలా.. మూడు గంటలు ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. త్వరలోనే ఆసరా పెన్షన్లు, రైతు బంధు పెంచేందుకు సీఎం కేసీఆర్ కసరత్తు చేస్తున్నారని వివరించారు. మార్చిలో కురిసిన అకాల వర్షాలకు దామెర మండలంలో పంటలు నష్టపోయిన 1,583 మంది రైతులకు రూ.1.36కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అక్కంపేట సర్పంచ్ ఎనకతళ్ల విజయహాంసాల్‌రెడ్డి, ఆత్మకూరు ఎంపీపీ చేతన్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ కక్కెర్ల రాధికా రాజు, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఎనకతళ్ల రవీందర్, గూడెప్పాడ్ మార్కెట్ చైర్మన్ బొల్లోయిన రాధా రవియాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, ఎంపీటీసీ పొగుల ఇంద్రా, సర్పంచ్‌లు ఎనకతళ్ల విజయ హాంసాల్‌రెడ్డి, సావురే కమలా రాజేశ్వర్‌రావు, అర్షం బలరామ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వేముల నవీన్, సతీశ్, కూస కుమారస్వామి, దేవరాజ్, శంకర్, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ పాల్గొన్నారు. దామెర ఎంపీపీ కాగితాల శంకర్, జడ్పీటీసీ కల్పన, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, సర్పంచ్‌లు కుక్క శ్రావణ్య అనిల్, శ్రీరాం రెడ్డి, రైతు సమితి మండల కన్వీనర్ బిల్లా రమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గండు రామకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దాడి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ కన్నెబోయిన రమేశ్, దామెరుప్పుల శంకర్, బత్తిని రాజుయాదవ్, పుల్యాల రఘుపతిరెడ్డి, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఇన్‌చార్జి ఏవో శ్రీనివాస్, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, వీవోలు పేర్వాల హైమావతి, హజామియా, పేర్వాల విజయ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, వేల్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన హమాలీ సంఘం నాయకులు

పరకాల: పరకాల హమాలీ సంఘం నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి హనుమకొండలోని నివాసంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హమాలీ సంఘం నాయకులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 60ఏండ్లలో కాని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏండ్లలో జరిగిందని, సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం పాలనకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. చేరిన వారిలో హమాలీ సంఘం అధ్యక్షుడు బొచ్చు అదాం, బాధ్యులు ఒంటేరు రాజమొగిలి, ఇంటేరు అశోక్, పెండెల రఘుపతి, బొచ్చు సామ్యేల్, కొయ్యడ మొగిలి, మేకల రాజు, డేగల ఉపేందర్, నల్లెల్ల సుధాకర్, ఒంటేరు మహేందర్, బొచ్చు చరణ్, తిక్క భద్రయ్యతోపాటు 50మంది ఉన్నారు. దళితబంధు పట్టణ కోఆర్డినేటర్ సోదా రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌లు గుండెబోయిన నాగయ్య, నల్లెల్ల లింగమూర్తి పాల్గొన్నారు.


గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే చల్లా

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంగెం, అక్టోబర్ 6 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కందకట్ల కళావతి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మండలంలోని 33 గ్రామాల సర్పంచ్‌లకు గాను కేవలం 9మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అలాగే 9 శాఖల అధికారులు సైతం సభకు హాజరు కాలేదు. దీంతో గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. ఐసీడీఎస్ అధికారులు తమ నివేదికలో బతికి ఉన్నవారిని చనిపోయారని చెప్పడంతో చింతలపల్లి ఎంపీటీసీ బొమ్మ పావని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ భూముల వద్ద కరెంటు తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే సరిచేయాలని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ డాక్టర్లను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. గవిచర్ల పశువైద్యాధికారి వంశీ మండల సభకు మరోసారి హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

## బీఆర్‌ఎస్ గెలుపునకు ఐక్యంగా పనిచేయాలి

శాయంపేట, అక్టోబర్ 6 : భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. శాయంపేటకు చెందిన పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీనియర్ నాయకుడు పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని గండ్ర సూచించారు. బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, నాయకుడు బాసాని శంకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గండ్రతో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి